సదర్ ఉత్సవాలకు హర్యానా దున్నలు

హర్యానా దున్నలతో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, చిత్రంలో తదితరులు

ముషీరాబాద్, అక్టోబర్ 28: మరో మూడు రోజుల్లో జరుగనున్న సదర్ ఉత్సవాల్లో సందడి చేయడానికి హర్యానాకు చెందిన దున్న రాజులు నగరానికి చేరుకున్నాయి. గోల్ టూ, విదాయక్, శ్రీకృష్ణ, షేరా నాలుగు దున్న రాజులను ముషీరాబాద్‌కు చెందిన మాజీ కార్పొరేటర్, ఎల్లారెడ్డిగూడ డివిజన్ బీఆర్ఎస్ నేత ఎడ్ల హరిబాబు యాదవ్ సోమవారం నగరానికి తీసుకువచ్చారు. ముషీరాబాద్ సత్తార్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గోల్ టూ అనే దున్న ఇటీవల పద్మశ్రీ వార్డుకు ఎంపిక కాగా, దాని యాజమాని నరేంద్ర సింగ్ పద్మశ్రీ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. గోల్ టూ దున్నపోతు ఆరు అడుగుల ఎత్తు, 8 అడుగుల పొడవు, 1800 కిలోల బరువుతో దేశంలో అత్యంత ఖరీదైన దున్నగా నిలిస్తుందన్నారు. సదర్ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

చెత్తశుద్ధి లేని నగర పాలన..

చిత్తశుద్ధిలేని నగర పాలనకు ఈ చెత్త దర్శనం.. నిదర్శనం. దుర్గంధాన్ని వెదజల్లుతున్న ఈ దృశ్యాన్ని చూస్తూ ఒకవైపు వాహన చోదకులు, మరోవైపు పాదచారులు వెళ్తున్నారు. వందలాది మంది వ్యాధి నివారణకు నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి రోజూ వస్తూ పోతుంటారు. అయితే, ఈ దృశ్యం కోరంటి - ఫీవర్ హాస్పిటల్‌ను ఆనుకొని ఉంది. కానీ, నగర పాలకులకు, ప్రభుత్వ అధినేతలకు ఇవేవి పట్టవు. ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి ఏపాటి అవగాహన ఉందో.. ఈ చెత్త దర్శనం.. చెప్పకనే చెబుతుంది. ప్రజారోగ్యానికి ఆ దేవుడే దిక్కు ఇక!

మేడ్చల్ జడ్పీ సీఈవో దిలీప్ కుమార్ బదిలీ

మేడ్చల్, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జడ్పీ సీఈవో దిలీప్ కుమార్ బదిలీ అయ్యారు. దిలీప్ కుమార్‌ను నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డిని భువనగిరి ఆర్డీవోగా బదిలీ చేశారు.

మర్రిపల్లి శ్రీదేవికి బహుజన సాహితీ అవార్డు

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): బహుజన సాహిత్య అకాడమీ-2024 అవార్డుకు మర్రిపల్లి శ్రీదేవి ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈ నెల 27న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీఎస్ఏ జాతీయ సదస్సులో ఆమె అందుకున్నారు. బుద్ధి మాంద్య పిల్లల ప్రవర్తన, హావభావాలపై తల్లిదండ్రులకు శ్రీదేవి అవగాహన కల్పిస్తుండటంతో ఆమె సేవలకు గాను ఈ అవార్డు లభించింది.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాసాని వీరేశ్ ఎన్నిక

ఎన్నికల అధికారి నుంచి అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న కాసాని వీరేశ్ ముదిరాజు

దుండిగల్, అక్టోబర్ 28: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసాని వీరేశ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని బాచుపల్లిలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాలకు సంబంధించిన సభ్యులు పాల్గొని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జగన్మోహన్ వ్యవహరించిన ఈ ఎన్నికలకు ఇండియన్ ఒలింపిక్ సంఘం ఏకేఎఫ్ఐ సభ్యులు అబ్జర్వర్లుగా వ్యవహరించగా అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా కాసాని వీరేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్ రెడ్డి, కోశాధికారిగా రవితో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నుకైన కాసాని వీరేశ్ ముదిరాజు మాట్లాడుతూ, తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి తనకు సేవ చేసే అదృష్టాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లను పర్మినెంట్ చేయాలి: సత్యవాణి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌ల రెగ్యులరైజేషన్ సమస్య 32 ఏండ్లుగా ఉన్నప్పటికీ వారు పర్మిట్ కాకపోవడం శోచనీయమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌ల అసోసియేషన్ అధ్యక్షురాలు సత్యవాణి ఆవేదన వ్యక్తం చేశారు. లాల్ బహదూర్ స్టేడియంలోని ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పుండింగ్లో ఉన్న తమ కోచ్‌ల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లుగా బాధ్యతలను నిర్వహిస్తున్న 187 మంది కోచ్‌లను వెంటనే పర్మినెంట్ చేయాలని సంఘం డిమాండ్ చేసింది.

హెచ్ఎండీఏలో ఆధిపత్య పోరు

- రెగ్యులర్ డిప్యుటేషన్ ఉద్యోగుల మధ్య వర్గ విభేదాలు
- ప్రాధాన్యత పోస్టుల్లో డిప్యుటేషన్ ఉద్యోగుల హవా
- ఉన్నతాధికారుల వద్దకు చేరిన పంచాయితీ

వారంతా డిప్యుటేషన్ పై వచ్చిన ఉద్యోగులు. పిల్లలు చదువులు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం సొంత జిల్లాలో హైదరాబాద్‌కు వచ్చినవారు. కానీ ఇప్పుడు ఆ ఉద్యోగులే హెచ్ఎండీఏ ఉద్యోగులకు కొరకరాని కొయ్యలుగా మారుతున్నారు. కీలక బాధ్యతలను దక్కించుకొని శాశ్వత ఉద్యోగుల అవకాశాలను లాగేసుకుంటున్నారు. దీంతో తమకున్న అనుభవం దృష్ట్యా రావాల్సిన పదవులను శాశ్వత ఉద్యోగులు పొందలేకపోతున్నారు. కీలక విభాగాలను తమ ఆధీనంలో పెట్టుకొని డిప్యూటేషన్ ఉద్యోగులు చేస్తున్న కార్యకలాపాలతో విసిగిపోతున్నారు. దీంతో హెచ్ఎండీఏ ఉద్యోగుల మధ్య విభేదాలకు అజ్యం పోస్తున్నాయి.

– సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ)

ఏడు జిల్లాల విస్తరించిన హెచ్ఎండీఏ కార్యాలయం ఉద్యోగుల వర్గ పోరుకు కేంద్రంగా మారింది. డిప్యుటేషన్ వర్సెస్ శాశ్వత ఉద్యోగులు అన్నట్లు పరిస్థితులు మారుతున్నాయి. ఉద్యోగులపై జరుగుతున్న ఆధిపత్యం పోరుతో వివాదాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా డిప్యుటేషన్ పై వచ్చిన ఉద్యోగులు కీలక పదవుల్లో ఉండటమే విభేదాలు కారణమవుతున్నది. నిబంధనల ప్రకారం సీనియారిటీ ద్వారా పొందాల్సిన అవకాశాలను శాశ్వత ఉద్యోగులు కోల్పోవడం కూడా అసహనానికి కారణం అవుతుంది. ఇక డిప్యూటేషన్ వచ్చిన ఉద్యోగులు కీలక విభాగాలలోకి ఉంటూ శాశ్వత సిబ్బంది లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

డిప్యుటేషన్ ఉద్యోగులకు అందలం....

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న అర్బన్ ఫారెస్ట్, బీబీపీ, హెచ్‌జీసీఎల్, ప్లానింగ్ వంటి ప్రధాన విభాగాల్లో డిప్యుటేషన్ ఉద్యోగులదే హవా కొనసాగుతున్నది. ఇతర శాఖల నుంచి వచ్చిన ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ , ఆయా సెక్షన్లలో శాశ్వత ఉద్యోగులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. శాశ్వత ఉద్యోగులను ఇతర సెక్షన్లకు బదిలీ చేసి, ఆ స్థానంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానంలో వచ్చిన సిబ్బందిని నియమించుకుంటున్నారు. దీంతో జరిగే కీలక కార్యకలాపాలన్నీ డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ జరుగుతున్నాయి. అర్బన్ ఫారెస్ట్ విభాగంలో డిప్యుటేషన్ పై వచ్చిన ఓ అధికారి ఆరేండ్లుగా కొనసాగుతున్నారు. ఆ అధికారి ఆడిందే ఆటగా వ్యవహారాలు సాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ హరితహారంలోనూ సదరు అధికారి చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలున్నాయి. ఇక ప్లానింగ్ విభాగంలో డీటీపీవో, జీహెచ్ఎంసీ వంటి విభాగాల నుంచి వచ్చిన వారు ఆధిపత్యం చెలాయిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇలా ప్రతి విభాగంలో డిప్యుటేషన్ ఉద్యోగులు అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ తమని మానసికంగా వేధిస్తున్నారని..తమకు రావాల్సిన ప్రయోజనాలకు గండి కొడుతున్నారని శాశ్వత ఉద్యోగులు వాపోతున్నారు.

నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు డిక్కీ కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్ కుమార్

ఎస్బీ ఐ డీజీఎం రోహిత్ కుమార్

శేరి లింగంపల్లి, అక్టోబర్ 28: నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువత ఉపాధి కల్పనకు డిక్కీ సంస్థ సేవలు అభినందనీయమని ఎస్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్ కుమార్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో డిక్కీ అధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు 20 ఎలక్ట్రిక్ వాహనాలను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిక్కీ తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ దాసరి అరుణ బృందం ప్రత్యేక చొరవతో 20 మంది ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు 20 ఎలక్ట్రిక్ వాహనాలు అందజేసినట్టు పేర్కొన్నారు. పురుషులతో పాటు 8 మంది మహిళలకు కార్ల అందజేశామని, మహిళలు ఆర్థికంగా రాణించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఓహెచ్ఎం కార్ల కంపెనీతో ఐదేండ్ల ఒప్పందం ప్రకారం, మొదటి దశలో 20 కార్లు అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో 100 కార్లు మహిళల ప్రాధాన్యతా క్రమంలో అందించనున్నట్లు డిక్కీ తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ దాసరి అరుణ తెలిపారు. ఎస్జీఐ ఏజీఏం వెంకటరమణ, వి.సోమశేఖర్, ప్రవీణ్ కుమార్, అజయ్ రాయ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

జూబ్లీహిల్స్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్, అక్టోబర్ 28: దూరవిద్యా విధానంలో అనేక మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన 10 ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలనే ఆలోచనకు వ్యతిరేకంగా యూనివర్సిటీకి చెందిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా వరుసగా నాలుగోరోజు సోమవారం మధ్యాహ్నం లంచ్ అవర్ ప్రదర్శనల్లో యూనివర్సిటీకి చెందిన అధ్యాపక, అధ్యాపకేతర, టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు. యూనివర్సిటీ అకడమిక్ బిల్డింగ్ వద్ద చేపట్టిన ప్రదర్శనలో ఉద్యోగులతో పాటు జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన కొంత మంది పూర్వ విద్యార్థులు సైతం పాల్గొన్నారు. జేఎన్ఏఎఫ్ఏయూకు 10 ఎకరాల స్థలం సరిపోదని, అంబేద్కర్ యూనివర్సిటీ స్థలం కాకుండా ఎక్కువ స్థలాన్ని తమ యూనివర్సిటీకి కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే ఉద్యమాన్ని తీవ్ర తరం చేయాల్సి ఉంటుందని ఉద్యోగుల జేఏసీ నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, ప్రొ. పుష్పా చక్రపాణి, డా. అవినాష్, డా. కిషోర్, డా. జి. అంబేద్కర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే.. కుట్రలు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, అక్టోబర్ 28: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని , ప్రజా సమ్యలపై నిత్యం ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొన లేక ఆయనను మానసికంగా దెబ్బ తీసేందుకు సర్కార్ కుట్రలు చేస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ బావ మరిది రాజ్ పాకాల ఇంట్లో జరిగిన దావత్‌ను రేవ్ పార్టీగా చిత్రీకరించడం దారుణమన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కేటీఆర్‌కు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో దావత్ చేస్తే తప్పకుండా విందులో మద్యం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం అన్నారు. అది ఏదో తప్పు చేసినట్లు చిత్రీకరిస్తున్నారని అన్నారు. రాజ్ పాకాల వారి కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య జరుపుకున్న పార్టీలో డ్రగ్స్ వాడారని అసత్య ప్రచారం చేశారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరవలేరని పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమం ద్వారా ప్రత్యేక తెలంగాణ సాధించడంతో పాటు, తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. కానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కేసీర్ కుటుంబ సభ్యుల ఇమేజ్ తగ్గించాలని వారిపై బురద చల్లుతూ, కుట్రలు చేస్తున్నారని అన్నారు. అయితే, ఆకాశం వైపు చూస్తూ ఉమ్మేస్తే ఏమవుతోందో తెలిస్తే.. సదరు నేతలు అలాంటి ప్రయత్నాలు చేయడానికి కూడా సాహసించరని హెచ్చరించారు.

కార్మికుల శ్రమతోనే లాభాల్లో సింగరేణి

ముగింపు వేడుకల్లో సింగరేణి ఎండీ ఎం.బలరాం

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): కంపెనీ లాభాల్లో ట్రేడ్ యూనియన్ లీడర్ల భాగస్వామ్యం ఎంతగానో ఉందని సింగరేణి కాలరీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.బలరాం అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో మైనింగ్ డివిజన్ ఏర్పాటు చేశారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో 'ట్రేడ్ యూనియన్ లీడర్లు' అనే అంశంపై నాలుగు రోజుల పాటు జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా సింగరేణి కాలరీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థకు వందేళ్లకు పైగా చరిత్ర వున్నదని, వేలాది మంది కార్మికులు సింగరేణిలో పనిచేసి కంపెనీ అభివృద్ధికి వారి శారీరక శ్రమను ధార పోశారన్నారు. నూతన టెక్నాలజీని ప్రవేశపెట్టడంతో పాటుగా అత్యధిక ఉత్పత్తిని సాధించడంలో ప్రతి కార్మికుడి శ్రమ, ట్రేడ్ యూనియన్ల సహకారం ఉందన్నారు. కార్మికుల ఐక్యతలో ట్రేడ్ యూనియన్ల పాత్ర గొప్పగా ఉందని, ఇంత మంది కార్మికుల మధ్య పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నానని అన్నారు. కార్యక్రమంలో బొగ్గు పరిశ్రమ సుస్థిర అభివృద్ధిలో ట్రేడ్ యూనియన్ల పాత్ర, లేబర్ పాలసీలో పారదర్శకత, కార్మికుల కోసం రూపొందించిన చట్టాలు, సేఫ్టీ మెజర్స్ కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ బిల్డింగ్, లీడర్‌షిప్ డెవలప్ అనే విషయాలపై నిపుణులతో శిక్షణ ఇచ్చినట్లు ఎస్కీ డైరెక్టర్ డా. జి.రామేశ్వర్ రావు తెలిపారు.

హాకా పటాకుల విక్రయాలు షురూ..

స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జయ సింహాలు

చిక్కడపల్లి, అక్టోబర్ 28: హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ఆధ్వర్యంలో దీపావళి టపాకాయల విక్రయాలు ప్రారంభం అయ్యాయి. సోమవారం రాత్రి లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హాకా ఎండీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థ అయిన హాకా ద్వారా ప్రతి సంవత్సరం టపాకాయల విక్రయాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్టేడియంలో పది స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, 31వ తేదీ వరకు ఈ స్టాల్స్ కొనసాగుతాయని తెలిపారు. అన్ని రకాల టపాయాలు విక్రయిస్తున్నామని తెలిపారు. జనరల్ మేనేజర్ ఎస్వీ ప్రసాద్, సిబ్బంది భుజంగరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వేడుకలతో మెట్ల బావుల పునరుద్ధరణ

ప్రారంభించిన ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొ. కుమార్

బావుల పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్న ఓయూ వీసీ ప్రొ. కుమార్ తదితరులు

సికింద్రాబాద్, అక్టోబర్ 28: ఉస్మానియా యూనివర్సిటీలోని చారిత్రాత్మకమైన మహాలక బాయి మెట్ల బావుల పునరుద్ధరణ - పునరుజ్జీవనం కార్యక్రమం సోమవారం అధికారికంగా ప్రారంభమైంది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరిధిలోని ఈ బావుల పునరుద్ధరణ, పునరుజ్జీవనం కార్యక్రమానికి ఓయూ వైస్ ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ మొలుగారం కుమార్, సాధిక్ అలీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ, ఈ పునరుద్ధరణ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందజేస్తుందని హామీ ఇచ్చారు. కల్పనా రమేష్ నేతృత్వంలోని ఈ చొరవ, ది రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ సహకారంతో ఇన్ఫోసిస్, దొడ్ల డెయిరీల ఉదార మద్దతుతో సాధ్యమైందన్నారు. ఈ పునరుద్ధరణ ప్రాజెక్ట్ విశ్వవిద్యాలయంలోని ఈ ముఖ్యమైన నీటి వారసత్వ ప్రదేశాలను సంరక్షించడం, పునరుద్ధరించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఈ పునరుద్ధరణ పనులు సక్సెస్ చేసి మెట్ల బావులను పూర్వ వైభవానికి తీసుకురావాలని, ఇందులో పాల్గొన్న వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, యూనివర్సిటీలోని గార్డెన్స్ అండ్ గ్రీన్ బెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ చెల్మల శ్రీనివాసులుతో పాటు ఇన్ఫోసిస్, దొడ్ల డెయిరీ, సేవ్ కాప్రా లేక్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రముఖులు, ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవీంద్ర నాథ్ కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్స్ సమస్యలను పరిష్కరించాలి

రవాణా మంత్రి పొన్నంకు కేకేసీ రాష్ట్ర ప్రతినిధి బృందం వినతి



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నేతలు

హిమాయత్‌నగర్, అక్టోబర్ 28: రాష్ట్రంలోని ఆటో, క్యాబ్ డ్రైవర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేకేసీ రాష్ట్ర ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కేకేసీ రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేసి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల వాహనాలు నగరంలోకి రాకుండా ఉండేందుకు కట్టడి చేసి, ఓలా, ఉబర్ సంస్థలు చేసే దోపిడీకి అడ్డుకట్టవేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాల నేతలు, రవాణా శాఖ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలు ప్రకటిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేకేసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, నేతలు తుమ్మ రాజశేఖర్ రెడ్డి, రుద్రాక్ష మల్లేశ్, కోట అనిత, హనుమంత రెడ్డి, నగేష్, బి.సత్యనారాయణ, యాదగిరి, విక్రం యాదవ్ పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో కెఫిన్ టెక్ కార్యాలయం ప్రారంభం

జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో నూతనంగా ప్రారంభించిన కెఫిన్ టెక్నాలజీ కార్యాలయంలో ఎల్ అండ్ టీ మెట్రో సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డితో పాటు కెఫిన్ టెక్నాలజీస్ ఎండీ, సీఈఓ శ్రీకాంత్ నాదెళ్లలు

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): టెక్నాలజీ ఆధారిత ఫైనాన్స్ సేవలను అందిస్తున్న కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ నూతన కార్యాలయాన్ని జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో ఏర్పాటు చేసింది. కెఫిన్ టెక్ విస్తరణలో భాగంగా మెట్రో స్టేషన్ ప్రాంగణంలోని రెండో అంతస్తులో ఒకేసారి 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. సోమవారం మెట్రో స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ఎల్ అండ్ టీ మెట్రో సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డితో పాటు కెఫిన్ టెక్నాలజీ ఎండీ, సీఈఓ శ్రీకాంత్ నాదెళ్లలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఫిన్ టెక్నాలజీ సీఈఓ శ్రీకాంత్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం టెక్నాలజీ హబ్‌గా మారింది. కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 600 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. స్థానికంగా నైపుణ్యం కలిగిన యువతకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సంస్థ టీఓడీ ఆపరేషన్స్ హెడ్ కేవీ నాగేంద్ర ప్రసాద్, హెచ్ఆర్ హెడ్ సుదీప్తో మండల్, చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ ఏవీఆర్ శ్రీనివాస శర్మ, సీఓఓ సీహెచ్ సుధీర్ పాల్గొన్నారు.